


గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాం



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

- ఏజెన్సీలో పలు రోడ్లకు శంకుస్థాపనలు



బల్లగరువులో బాలింతలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అనంతగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు త్రికరణశుద్ధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలోని పినకోట పంచాయతీ బల్లగరువులో రూ.105 కోట్లతో 19 రోడ్లకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపనలు చేశారు. అనంతరం బల్లగరువులో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తూ.. వారిలో నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. అడవిబిడ్డల మోములో నవ్వులు చూడాలన్నదే తన కోరిక అన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకు సాగుతున్నదన్నారు.



ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని మర్రిబంధలో గృహ నిర్మాణాలు

సొంతింటి కల సాకారం దిశగా..

ఇళ్ల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం దృష్టి

- తొలి విడత 6,643 నిర్మాణాలు
- ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గృహ లబ్ధిదారుల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలి విడత కింద ఇప్పటికే వివిధ దశల్లో నిలిచిపోయిన 6,643 గృహ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ క్రమంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రచారమే తప్ప పనులు జరగని జగనన్న కాలనీల్లో ఇప్పుడు పనులు ఊపందుకున్నాయి.



కె.కోటపాడు మండలం సింగన్నదొర పాలెంలో గృహ నిర్మాణాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల నిర్మాణాల పేరుతో ప్రచార ఆర్భాటమే తప్ప ఎక్కడా ఇళ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగలేదు. బిల్లుల మంజూరులో జాప్యం, భవన నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు గృహ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడమే కాకుండా, కొత్తగా లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేసేందుకు 'మన ఇల్లు- మన గౌరవం' పేరుతో నిర్మాణాలను వేగవంతం చేసింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు వెబెక్స్ ద్వారా సమీక్షలు జరుపుతున్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని, ప్రతి వంద రోజులకు నిర్దిష్ట సంఖ్యలో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి దశల వారీగా పూర్తి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో 2015 నుంచి ఇటీవల వరకు గృహ నిర్మాణ సంస్థ ద్వారా రూ.65,800 ఇళ్లు పేదలకు మంజూరయ్యాయి. వీటిలో 17,633 గృహ నిర్మాణ పనులు వివిధ కారణాలతో ప్రారంభంకాలేదు. 48,167 గృహ నిర్మాణ పనులు ప్రారంభం కాగా 28,746 పూర్తయ్యాయి. ప్రస్తుతం వివిధ దశల్లో 19,421 గృహ నిర్మాణాలు ఉన్నాయి. వీటిలో తొలి దశ కింద 6,643 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. వీటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ విజయకృష్ణన్ నేతృత్వంలో పీడీ శ్రీనివాస్ పర్యవేక్షణలో గృహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మాణ పనులు చేపడుతున్న 6,643 ఇళ్లలో ఇప్పటికే 5,085 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 1,558 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి జిల్లాలో తొలిదశ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని పీడీ శ్రీనివాసరావు తెలిపారు. పనులు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపునకు నిధుల కొరత లేదన్నారు. కాంట్రాక్టర్ చేపట్టిన గృహ నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

వరి వర్షార్పణం

వాయుగుండం ప్రభావంతో వర్షాలు

- కొందరు కోతలు కోసి వరి పనలను పొలాల్లో వదిలేయగా, మరికొందరు కుప్పలు వేసిన వైనం

- ఇవి కూడా నీట మునక
- కోతలు కోసిన వాటిని పంట నష్టం కింద పరిగణించరని తెలిసి ఆవేదన
- జిల్లాలో పెద్దగా పంట నష్టం లేదంటున్న వ్యవసాయాధికారులు



మార్టూరులో పొలంలోనే తడుస్తున్న వరి పనలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు కోతలు కోసి వరి పనలను పొలాల్లోనే వదిలేశారు. మరికొందరు కుప్పలు వేశారు. వర్షాలకు ఇవి కూడా నీటమునిగాయి. అయితే వీటిని అధికారులు పంట నష్టం కింద పరిగణించరని తెలిసి రైతులు కలత చెందుతున్నారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 56,410 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేపట్టారు. రెండు రోజుల కిందట వరకు 21,142 హెక్టార్లలో (38 శాతం) వరి కోతలు పూర్తయ్యాయి. 15,524 హెక్టార్లలో వరి కుప్పలు వేసుకున్నారు. 3,038 హెక్టార్లలో వరి పనల మీద ఉందని వ్యవసాయ శాఖ గుర్తించింది. మిగతా 16,706 హెక్టార్లలో వరి కోతలు కోయలేదు. కాగా వాయుగుండం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులతో లోతట్టు ప్రాంతాల్లో కోత దశలో వున్న వరి పైరు నీటమునిగిపోయింది. వ్యవసాయశాఖ అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో దేవరాపల్లి, మాడుగుల, చోడవరం, కె.కోటపాడు, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు స్వల్పంగా నీళ్ల పాలైనట్టు గుర్తించారు. ప్రతి మండలంలో లోతట్టు ప్రాంతాల్లో 5 నుంచి 10 ఎకరాలలోపు వరి పొలాలు మాత్రమే నీటిలో మునిగి ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన శనివారం సాయంత్రానికి 70 నుంచి 100 ఎకరాలలోపే వరి పొలాలు నీటిలో మునిగి ఉన్నాయని, మిగిలిన పంటకు ఎటువంటి నష్టం లేదని అంటున్నారు. నిబంధనల ప్రకారం కోయని వరి పంట నీటిలో మునిగిపోయి 35 శాతానికి పైగా ... మిగతా 8వ పేజీలో



తుమ్మపాలలో నీట మునిగిన వరి పనలు

నీట మునిగిన వరి పనలు

తుమ్మపాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

వాయుగుండం కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో వరి పనలు నీట మునిగాయి. ప్రధానంగా తుమ్మపాల, మార్టూరు, సంతపాలెం తదితర గ్రామాల్లో కూలీల కొరత కారణంగా కోత కోసిన పంటలు కుప్పలుగా వేసుకునే అవకాశం లేక పలువురు రైతులు కోత కోసిన వరి పనలను పొలాల్లోనే వదిలేశారు. దీంతో రెండు రోజులుగా పొలాల్లో వరి పనలు నీళ్లలో ఉండిపోయాయి.

టీడీపీ మద్దతుదారులదే పైచేయి

- ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు
- నాలుగు ప్రాజెక్టు కమిటీలు ఏకగ్రీవం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. శనివారం జరిగిన నాలుగు ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష,ఉపాధ్యక్షుల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, నీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులదే పైచేయిగా నిలిచిన సంగతి తెలిసిందే.

ఒక మేజరు నీటి ప్రాజెక్టు, మూడు మధ్యతరహా నీటి ప్రాజెక్టులకు శనివారం జరిగిన ఎన్నికల్లో నాలుగు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు టీడీపీ మద్దతుదారులకే దక్కాయి. ప్రాజెక్టుల వారీగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు ఇవి.

ప్రాజెక్టు పేరు	అధ్యక్షుడు	ఉపాధ్యక్షుడు
తాండవ (మేజర్)	కరక సత్యనారాయణ	మేదపురెడ్డి జోగిబాబు
రైవాడ	పోతల పత్రినాయుడు	బొడ్డు ఉమాదేవి
కోనాం	పోతల చిన్నంనాయుడు	కొట్యాడ చిన్నం నాయుడు
పెద్దేరు	అద్దేపల్లి జగ్గారావు	ఆర్లె గోవిందరాజు

మట్టిలో మాణిక్యం మనీష్

- ఇస్రో శాస్త్రవేత్తగా ఉద్యోగం పొందిన పెయింటర్ కుమారుడు
- మరో మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



తల్లిదండ్రులతో మనీష్

రావికమతం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

మట్టిలో మాణిక్యంలా ఆ పేదింటి బిడ్డ మెరిశాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన నేతల మనీష్ ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)లో సైంటిస్టు ఉద్యోగాన్ని పొందడమే కాకుండా గేట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి మరో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలో కొత్తకోట గ్రామ అంబేడ్కర్ కాలనీకి చెందిన నేతల మోదయ్య లక్ష్మిలది నిరుపేద కుటుంబం. మోదయ్య పెయింటర్‌గా పనిచేసుకుంటూ కుమారుడు నేతల మనీష్, కుమార్తె సోనియాలను ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివించాడు. మనీష్ బీటెక్ పూర్తి చేశాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ... మిగతా 8వ పేజీలో

ఆరోగ్య శాఖలో బదిలీలు

- అనకాపల్లి డీఎంహెచ్‌వోగా డాక్టర్ రవికుమార్
- విజయనగరం డీఎంహెచ్‌వోగా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ జీవనరాణి
- రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (మేల్) ప్రిన్సిపాల్‌గా శ్రీకాకుళం జిల్లా డీఎంహెచ్‌వో బి.మీనాక్షి



డాక్టర్ రవికుమార్

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్య శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఇతర జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాలకు చెందిన అధికారులు జిల్లాకు వచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.జీవనరాణి విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ బి.మీనాక్షి నగర పరిధిలోని మేల్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌టీసీ) ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు సీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.శ్రీనివాస్ నగరంలోని విక్టోరియా ఆస్పత్రి సీఎస్ఆర్ ఎంవోగా నియమితులయ్యారు. తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ యు.శ్రీహరి కేజీహెచ్‌లో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న సీఎస్ఆర్‌వోగా నియమితులయ్యారు.

అనకాపల్లి డీఎంహెచ్‌వోగా రవికుమార్

చిత్తూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఓ.ప్రభావతి దేవి పాడేరు జిల్లా అడిషనల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణిగా నియమితులయ్యారు. కాగా, విజయనగరం జిల్లా గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ పి.రవికుమార్ అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులయ్యారు.

అదుపులోకి రాని అతిసార

- భరణికంలో పెరుగుతున్న బాధితులు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఇందల అమ్మాజీ

పరవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని భరణికంలో అతిసార అదుపులోకి రాలేదు. శనివారం మరో నలుగురు డయేరియా బారిన పడ్డారు. ఈ గ్రామంలో ఆరు రోజుల క్రితం అతిసార ప్రబలడంతో 18 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది సాధారణ స్థితికి రావడంతో 16 మంది ఇళ్లకు చేరుకున్న సంగతి తెలిసిందే. గ్రామానికి చెందిన ఇందల అమ్మాజీ, పెదిరెడ్ల రమ్యశ్రీ, ఎం.పావని, సుంకర సత్యారావులకు శనివారం ఉదయం వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబసభ్యులు పరవాడ పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. కాగా గత బుధవారం 13 మంది, గురువారం నలుగురు, శుక్రవారం ఒకరు, శనివారం నలుగురితో కలిపి మొత్తం 22 మంది డయేరియా బారిన పడ్డారు. వీరిలో ఇప్పటి వరకు 16 మంది సాధారణ స్థితికి రావడంతో ఇళ్లకు చేరుకున్నారు. మిగతా ఆరుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

సంతాన లేమితో సతమతం

గతంలో ఐదు శాతం మందిలోనే...
ఇప్పుడు 15 శాతానికి పెరిగినట్టు గణాంకాల వెల్లడి

- ఇరువురిలో ఎవరైనా లేదా ఇరువురూ కారణం కావొచ్చు
- వృత్తిపరమైన ఒత్తిడి, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వంటి వాటితో సమస్య రెట్టింపు
- 30 ఏళ్లలోపు వివాహాలు చేసుకోవాలి
- సంవత్సరాల తరబడి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం మానుకోవాలి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖలోని ఎం.వి.పి. కాలనీకి చెందిన మహిళ (34) ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. సహచర ఉద్యోగితో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. ఇద్దరూ అన్యోన్యంగా ఉంటున్నారు. మొదట్లో రెండేళ్లపాటు పిల్లలను వద్దనుకున్నారు. ఐదేళ్ల నుంచి పిల్లల కోసం యత్నిస్తున్నా ఫలితం దక్కలేదు. దీంతో వైద్యులను సంప్రతించారు. ఇద్దరిలో కొన్నిరకాల ఇబ్బందులు ఉన్నట్టు గుర్తించిన వైద్యులు మందులు వినియోగించాల్సిందిగా సూచించారు. అప్పటికీ ఫలితం లేకపోతే మరో పద్ధతిలో యత్నించేందుకు సిద్ధం కావాలని సూచించారు.

సీతమ్మధారకు చెందిన యువకుడి (32)కి నాలుగేళ్ల కిందట వివాహం అయింది. ప్రముఖ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వివాహం జరిగి ఏళ్లు గడుస్తున్నా పిల్లలు లేకపోవడంతో తల్లిదండ్రుల ఒత్తిడి మేరకు దంపతులు వైద్యుల వద్దకు వెళ్లారు. ఇద్దరికీ పరీక్షలు నిర్వహించిన వైద్యులు అబ్బాయిలో సమస్య ఉన్నట్టు నిర్ధారించారు. స్పెర్మ్ కౌంట్ (వీర్యకణాల సంఖ్య) తక్కువగా ఉండడంతోపాటు నాణ్యత లేదని నిర్ధారించారు. కౌంట్ పెరిగేందుకు ప్రస్తుతం మందులు వాడుతున్నారు.

గడిచిన కొన్నాళ్లుగా సంతాన లేమితో బాధపడుతున్న దంపతుల సంఖ్య పెరిగింది. పదేళ్ల కిందటి వరకు సంతాన లేమితో బాధపడేవారు ఐదు శాతం కంటే తక్కువ ఉండేవారని, ఇప్పుడు 15 శాతానికి పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. ఇందుకు అనేక అంశాలు కారణమవుతున్నాయంటున్నారు. అవేమిటో తెలుసుకుంటే సమస్యను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ టి.రాధ తెలిపారు.

సంతానలేమి సమస్య అంటే.?

కుటుంబ నియంత్రణ పద్ధతులేవీ పాటించకుండా దంపతులు ఇద్దరూ ఏడాదిపాటు కలిసి ఉంటున్నా సంతానం కలగకపోతే సంతానలేమి సమస్యగా పేర్కొంటారు. ఏడాది దాటితే వైద్యులను సంప్రతించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 15 శాతం మంది జంటలు ఈ తరహా సమస్యతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి వారంతా వైద్యులను సంప్రతించి సమస్యను తెలుసుకోవడం చాలా కీలకంగా డాక్టర్ రాధ పేర్కొన్నారు. సంతాన లేమి సమస్యకు ఏ ఒక్కరో కారణం కాదన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. పిల్లలు పుట్టకపోవడానికి మహిళలు 30 శాతం, పురుషులు 30 శాతం, మరో 30 శాతం ఇద్దరూ కారణం కావచ్చునని, పది శాతం కారణాలు తెలియవని వైద్యులు చెబుతున్నారు. అయితే, సంతానలేమి సమస్య ... మిగతా 8వ పేజీలో

రైతులకు అందుబాటులో ఉండండి

▸▸ నియోజకవర్గ వ్యవసాయాధికారులకు ఏడీఈ సూచన



వ్యవసాయాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ ప్రభాకర్‌రావు

ఎలమంచిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 26 నుంచి పీఎం కిసాన్ కోసం వివరాలు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రావు సూచించారు. నియోజకవర్గంలోని వ్యవసాయాధికారులతో శనివారం ఎలమంచిలిలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి విలువైన సమాచారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎలమంచిలి మండల వ్యవసాయాధికారి మోహన్‌రావుతో పాటు ఆయా మండలాల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న యాదవ కార్పొరేషన్ చైర్మన్ రంగనాయకులు

రాంబిల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు యాదవ కార్పొరేషన్ చైర్మన్ ధూళి రంగనాయకులు అన్నారు. మండలంలోని హరిపురం సచివాలయంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ధూళి రమణ, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధిలో అంతా కంకణబద్ధులు కావాలి'

రాంబిల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే తద్వారా అక్కడివారంతా ఆరోగ్యవంతంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి అన్నారు. శనివారం రాంబిల్లి, రాజు కోడూరు గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో ఆమె భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్థులు కూడా కంకణబద్ధులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్‌డీ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాటిపల్లి సబ్ సెంటర్‌ను పరిశీలించిన వైద్య బృందం

మునగపాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాటిపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ బృందం సభ్యులు సందర్శించారు. బృందంలో సభ్యులైన డాక్టర్లు నాగిరెడ్డి గణేశ్, ఆర్.రేజికుమార్, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ ఎం.మాణిక్యం ఉప కేంద్రం ద్వారా ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలకు వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి సేవలను తెలుసుకున్నారు.. పీహెచ్‌సీ వైద్యాధికారులు దుర్గాప్రవల్లిక, సీహెచ్‌వో ఆర్.దేవకాంత, సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా గ్రామాల అభివృద్ధి

▸▸ ఎలమంచిలి, రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశాల్లో ఎంపీపీలు బోదెపు గోవింద్, ఎంపీపీ జి.శిరీష

ఎలమంచిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని తీర్చిదిద్దుదాం అని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. శనివారం ఎలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సమావేశానికి హాజరుకాని అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికైన ఇటువంటి సమావేశాలకు హాజరు కాకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మాట్లాడుతూ పలు గ్రామాల్లో తాగునీటి కుళాయిలకు మోటార్లు అమర్చుతున్నట్టు తమ దృష్టికి వస్తుందన్నారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అటువంటి ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ఎలమంచిలి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

అనంతరం విద్య, వైద్యం, హౌసింగ్ తదితర శాఖలకు చెందిన అధికారులు నివేదికను చదివి వినిపించారు. పలువురు సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. వైస్ ఎంపీపీ రాజాన శేషు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు, మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



రాంబిల్లి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

రాంబిల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమష్టిగా పనిచేసి పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపిద్దామని ఎంపీపీ జి.శిరీష అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా గ్రామాల్లో సమస్యలనుఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ 104, 108 సేవలు అన్ని గ్రామాలకు అందేలా చూడాలన్నారు. కృష్ణంపాలెం పంచాయతీలో ఎంఎల్‌హెచ్‌పీని ఏర్పాటు చేయాలని, జగనన్న కాలనీలో తాగు నీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పి.సత్తిబాబు కోరారు. గ్రామాల్లో ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించినా తమకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు వాపోయారు. వాడనర్సాపురంలో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డులో మందుపై ఉన్న కల్వర్టుకు రంధ్రం పడిందని సర్పంచ్ కె. రామారావు తెలిపారు. వెంటనే పూడ్చాలని కోరారు.

ఖరీఫ్‌లో ఏర్పడిన తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎంతమందికి పంటల బీమా వచ్చిందో తెలపాలని పలువురు పట్టుబట్టారు. అలాగే పలువురు సభ్యులు గ్రామాల వారీగా సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, ఎంపీ డీవో జయమాధవి, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, వివిధ శాఖల అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు



అచ్యుతాపురంలో కన్నబాబురాజు ఆధ్వర్యంలో వేడుకలు



.మునగపాకలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

అచ్యుతాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను అచ్యుతాపురం మండలంలో పోటీపోటీగా నిర్వహించారు. కొండకర్లలోని ఇచ్చా ఫౌండేషన్ (దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల)లో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిపారు. కేక్ కట్‌చేసి దివ్యాంగ పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు. అలా మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు అచ్యుతాపురంలోని వైసీపీ కార్యాలయంలో జగన్ జన్మదిన కార్యక్రమన్ని నిర్వహించారు. దేశం శెట్టి శంకరరావు, మారిశెట్టి సూర్యనారాయణ, పిన్నమరాజు వాసు, కోట్ని శివ, పిన్నమరాజు రవీంద్ర రాజు, నర్మాల కుమార్, కోన బుజ్జి, ఉమ్మిడి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాసరావు, ఉమ్మిడి జగన్, ఈత బాబూరావు, నగిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : మండలంలోని కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాథ పిల్లల నడుమ శనివారం మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. తొలుత ఎంపీపీ బోదెపు గోవింద్ కేక్‌కట్ చేసి పిల్లలకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, నాయకులు గొర్లె వెంకట్, పిట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని పంచదార్ల గ్రామంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుగా వైఎస్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కేక్ కట్ చేశారు. దిమిలి నాయకులు నగిరెడ్డి మురళీకృష్ణ, గేదెల శ్రీను, కె.ప్రసాద్, మురకాడ, మర్రిపాలెం, కుమ్మరాపల్లి సర్పంచులు అప్పన్నదొర, బాబూరావు, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాక : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైసీపీ అధికారం కోల్పోవడంతో పలు వర్గాలకు భరోసా కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి అప్పారావు, దిమ్మల అప్పారావు, కాండ్రేగుల జగన్, భీశెట్టి గంగ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశతాం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి

▸▸ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

▸▸ ఉపాధ్యాయులకు డీఈవో అప్పారావునాయుడు సూచన



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

మునగపాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు అన్నారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అర్థ మయ్యే రీతిలో పాఠాలను బోధించాలన్నారు. ఉపాధ్యాయులు ఏ విధంగా పాఠాలు చెప్తున్నది అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపమాక క్షేత్రంలో ఘనంగా తిరువీధి



మాఢవీధుల్లో స్వామి తిరువీధి సేవలో భక్తులు

నక్కపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంతో శనివారం గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని గరుడ వాహనంపైనా, పల్లకీలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజలు చేశారు. నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విశాఖ డెయిరీ అక్రమాలపై దర్యాప్తు జరపాలి

▸▸ జనసేన జిల్లా సెక్రటరీ గోవిందరావు



మాట్లాడుతున్న గోవిందరావు

నక్కపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుటుంబీకులు తమ ఆస్తులు కాపాడుకోవడం కోసం, ఎన్నికలైన తరువాత అధికార పార్టీలోకి చేరిపోవడం అలవాటుగా మారిందని, ఈ స్థితిలో ఆయనను డెయిరీ చైర్మన్‌గా అతనిని తొలగించి, కలెక్టర్‌కు ఆ బాధ్యతలు అప్పగించాలని జనసేన జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు డెయిరీ అక్రమాలపై హౌస్ కమిటీ వేస్తానని చెప్పగానే ఆనంద్‌లో అలజడి మొదలైందన్నారు. డెయిరీ చైర్మన్‌గా తులసీరావు ఉన్న సమయంలో శ్రీకాకుళం నుంచి రాజమహేంద్రవరం వరకూ హైవేకు ఇరువైపులా పలువురు డైరెక్టర్లు భూములు కొని, ఇప్పుడు తమ బంధువుల పేరుతో బినామీలుగా మార్చుకున్నారని ఆరోపించారు. డెయిరీని పెంచి పోషిస్తున్న పాడి రైతులకు కనీస ధర కూడా ఇవ్వడం లేదని, డెయిరీ డైరెక్టర్లు మాత్రం దేశ,విదేశాల్లో రైతుల సొమ్ముతో షికార్లు చేస్తున్నారన్నారు.డెయిరీ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు.ఆయన వెంట జనసేన జిల్లా నేత కురందాసు అప్పలరాజు ఉన్నారు.

భూ సమస్యలపై అర్జీలు ఆన్‌లైన్ నమోదు

కోటవురట్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):రైతులు ఇచ్చినా ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదవుతుందని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. మండలం పందూరు గ్రామంలో సర్పంచ్ చికెట్ల జగదీష్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రీసర్వేలో భూముల కొలతల్లో తేడాలున్నా రైతులు సదస్సులో దరఖాస్తుచేసుకోవాలని ఆయనసూచించారు. 24 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నారాయణరావు, చికెట్ల వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపాడులో రెవెన్యూ సదస్సు

నక్కపల్లి: వేంపాడులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు 14 వినతిపత్రాలు అందజేసినట్టు తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. వేంపాడు, అమలాపురం సర్పంచ్‌లు ఏడిద నూకరత్నం, పెదపూడి శంకరరావు, అయినంపూడి మణిరాజు, ఉప సర్పంచ్ అప్పలరాజు పాల్గొన్నారు.

వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

ఎస్. రాయవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు తడిచిన వరి పనలపై వెంటనే ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని ఏవో సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో శనివారం ఏవో పొలాల్లో తడిసిన వరి పనలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనలు తడిసి ధాన్యం రంగుమారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు 50 గ్రాముల ఉప్పును లీటర్ నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని చల్లాలన్నారు.

పాయకరావుపేటలో అంబేడ్కర్ పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు

▸▸ ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల మరమ్మతుకు రూ.35 లక్షలు మంజూరు ▸▸ ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ ప్రసాద్

పాయకరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పట్టణంలో అంబేద్కర్ పార్కు అభివృద్ధితోపాటు ఆవరణలో కళ్యాణమండపం నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈఈ గంగుల ప్రసాద్ తెలిపారు. శనివారం పాయకరావుపేట వచ్చిన ఆయన మండల టీడీపీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరుల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ పార్కుతో పాటు పార్కు ఆవరణలో ఉన్న బాలుర వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం మంత్రి ఆదేశాల మేరకు అంబేదర్కర్ పార్కు అభివృద్ధితోపాటు శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలుర-1 వసతి గృహం స్థానంలో కళ్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలనకు వచ్చినట్టు చెప్పారు. ఈ మేరకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పట్టణంలో ఎస్సీ బాలురు-2 వసతి గృహం రూ.20 లక్షలు, ఎస్సీ బాలికల వసతి గృహం మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ స్వరూప్, ఎస్‌డబ్ల్యూఓ జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కశింకోట సత్తిబాబు, టీడీపీ నాయకులు పల్లా విలియం కేరి, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి పండు, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీను, ఎమిలి దుర్గాప్రసాద్, వీరబాబుపాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ ప్రసాద్ తదితరులు

నేడు రెండు గ్రామాలకు విద్యుత్‌కు అంతరాయం

ఎస్. రాయవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు 11 కేవీ గోకులపాడు ఫీడర్‌లోని భీమవరం, గోకులపాడు గ్రామాలకు ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ అంతరాయం కలగనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేయనున్నట్టు,వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలకు మెగా ఫోన్ వితరణ

పాయకరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావనంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దాతలు శనివారం మెగా ఫోన్ అందజేశారు. దాతలు బైపిరెడ్డి లక్షిత్, రావు అన్విత్రాశ్రయ్ కలిసి శ్రీసత్య సాయి ట్రస్టు ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ సాయి వికాస్ సేవా సంస్థ ద్వారా హెచ్‌ఎంకి దీనిని అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస్ ప్రతినిధులు కాళ్ళ మాతినాయుడు, వెలుగుల అర్జునరావు, పసుపులేటి మరళీకృష్ణ, చిట్టిబాబు, చాందిని, సాయిచంద్, మంతిన రాధాదేవి, వెంకటలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్త నుం చి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు అన్నారు. మండలంలోని నామవరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. వానపాములను వదిలిన తొట్టిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లపై చెత్తా, చెదారాలను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం పి.ఎల్.పురంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు, సొంపును పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఈవోపీఆర్‌డీ సి.హెచ్. చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ ఫణివర్మ, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి శివ, మల్లికార్జున ఆచారి, తదితరులు పాల్గొన్నారు.



నామవరంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో జయప్రకాశరావు

ఘనంగా మాజీ సీఎం వై.ఎస్. జగన్ జన్మదిన వేడుకలు

పాయకరారావుపేట రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శ్రీరాంపురంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కంబాల జోగులు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల గుండెల్లో నిలిచిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిక్కాల రామారావు, కంబాల సందీప్, జడ్పీటీసీ లంక సూర్యనారాయణ, దగ్గుపల్లి సాయిబాబా, రాజేశ్‌ఖన్నా, వంగలపూడి రామారావు, చోడిపల్లి శ్రీనివాసరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, పస్పీరు పాపారావు, చేపల తాతాజీ, మేడశెట్టి రామగోవిందు, కోడ కోటేశ్వరరావు, కొంతం నరేశ్, సతీష్, యజ్జల అన్నవరం, పల్లెల వెంకట్, బాలకృష్ణరెడ్డి అవతారంరాజు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

పాయకరావుపేట: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైసీపీ నాయకులు జగన్ బర్త్ డే కేక్‌ను కట్‌చేశారు. అనంతరం రోగులకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు.నాయకులు ధనిశెట్టి బాబి, జడ్పీటీసీ లంక సూరిబాబు, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, పల్యాల లచ్చబాబు, రాజేష్‌ఖన్నా పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల: కోటవురట్ల, కె. వెంకటాపురం గ్రామాల్లో జగన్ జన్మదిన వేడుకలు ఆ పార్టీ మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ సాగి సీతబాబు జగన్ పుట్టినరోజు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కె. వెంకటాపురంలోఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీకేపల్లి ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, కోటవురట్ల సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ వంగలపూడి రాంబాబు, సింగంపల్లి కిశోర్, పందూరు సర్పంచ్ జగదీశ్, తంగేడు సర్పంచ్ కోరుప్రోలు శివ పాల్గొన్నారు.

ఎస్. రాయవరం: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో మాజీ సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ముఖ్య అతిథిగా కట్ చేశారు. అనంతరం పెనుగొల్లు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అప్పన్న, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కోటవురట్లలో జగన్ జన్మదినోత్సవ కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

రాయితీపై సోలార్ విద్యుత్ యూనిట్లు

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్



మాట్లాడుతున్నఎస్ఈ ప్రసాద్

కోటవురట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం సబ్సిడీ కల్పిస్తోందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ యూనిట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అలాగేగ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, మండల ఇంజనీర్ వర్మ, ఏఈపరమేశ్వరరావు, పాల్గొన్నారు. అలాగే, మం డలంలోని పలు ప్రభుత్వశాఖల అధికారులతో ప్రత్యేకాధికారి ప్రసాద్ సమీక్ష జరిపారు. శాఖల వారీగా జరుగుతున్న పనులు, పెండింగ్ సమస్యలపై ఆయన చర్చించారు. పథకాలకు ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎస్ఐ సన్నిబాబు, ఎంఈవోలు నరేశ్, వి. నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



గొడిచెర్లలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం, గొడిచెర్ల, డీఎల్‌పురం, వేంపాడు, నక్కపల్లి జడ్పీ హైస్కూళ్లలో శనివారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 22న గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించారు. దేవవరంలో ఎంఈవో వేమగిరి నూకరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన గణిత నమూనా ప్రదర్శనలను పరిశీలించారు.శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో హెచ్‌ఎంలు ఎస్.అప్పలరాజు, మూర్తిరాజు, డేవిడ్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

విద్యుత్ వినియోగదారులకు సత్వర న్యాయం

▸ ఇదే సీజీఆర్ఎఫ్ లక్ష్యం ▸ రిటైర్డు జిల్లా జడ్జి డాక్టర్ సత్యనారాయణ


వినియోగదారు నుంచి ఫిర్యాదును స్వీకరిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కొత్తూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించి న్యాయం చేసేందుకే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఏర్పాటైనట్టు విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ వెల్లడించారు. కశింకోట సబ్ డివిజన్ పరిధి కొత్తూరు సబ్ స్టేషన్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ముందుగా సంబంధిత ఏఈ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. అంతేకాకుండా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి కూడా చెప్పవచ్చునన్నారు. ఆయా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత ప్రాంత కార్యాలయ సిబ్బందిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను నిర్దేశించిన కాలంలో విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ ఏడాది మొత్తం 8,264 ఫిర్యాదులు రాగా వాటిలో 8,204 ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పారు. 2016 నుంచి 2024 వరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 107 మంది వినియోగదారులకు నష్ట పరిహారం కింద రూ.14,26,650 అందజేశామని వివరించారు. కాగా పలువురు వినియోగదారులు వినతి పత్రాలను అందజేశారు. ముందుగా ఏఎంఏఎల్ కళాశాలలో విద్యుత్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. టెక్నికల్ సభ్యులు మాసిలా మణి, ఈఈ రామకృష్ణ, ఏఏవో మధు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి మార్కెట్లలో ఆశీల వసూల వేలం వాయిదా


జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఆశీల వేలం నిర్వహిస్తున్న ఆర్వో సురేష్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్‌లలో ఆశీల వసూలుకు సంబంధించి శనివారం జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. వేలం పాటకు పొంద్రంకి సత్యారావు, బొడ్డేడ వెంకటరమణమూర్తి, పీలా రామచంద్రరావులు మాత్రమే హాజరయ్యారు. జనవరి ఒకటి నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆశీల వసూలకు సంబంధించి రూ.17లక్షల ఐదు వేలుగా నిర్ణయిస్తూ ఆర్వో పి.సురేష్ పాట నిర్వహించారు. అయితే మూడు నెలలకు అంత మొత్తానికి పైగా పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

'మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ



తుమ్మపాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కోన లక్ష్మణ ఎన్నికయ్యారు. విజయవాడలోని దాసరి నాగభూషణం భవన్‌లో శుక్రవారం జరిగిన యూనియన్ రాష్ట్ర ఆరవ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి ఇందుకు సంబంధించిన నియామకపు పత్రాన్ని లక్ష్మణకు అందజేశారు. పలువురు ఏఐటీయూసీ నాయకులు ఆయనను అభినందనలు తెలియజేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ధ్యానం చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్నినిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ధ్యానం మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా భావోద్వేగ నియంత్రణ, నైపుణ్య పరిధిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యోగా, ధ్యాన గురువు ఎం.లీలా మాట్లాడుతూ ధ్యానంతో మానసిక ప్రశాంతతను ఎలా సాధించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఆధార్ తరహా గుర్తింపు కార్డులు

▸ వ్యవసాయ రంగం డిజిటలీకరణలో భాగంగా ఏర్పాట్లు ▸ గుర్తింపు సంఖ్యతో పథకాలు పొందేందుకు అర్హత

▸ వ్యవసాయాధికారుల శిక్షణ శిబిరంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు



వ్యవసాయాధికారుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

తుమ్మపాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగం డిజిటలీకరణలో భాగంగా రైతులకు ఆధార్ తరహా గుర్తింపు కార్డులు అందించనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులకు శనివారం ఇక్కడ జరిగిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. రైతులకు కేటాయించిన విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవచ్చునన్నారు. అలాగే రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చునని, కిసాన్ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకోవచ్చునని వివరించారు. విద్యావంతులైన రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఈ నమోదు ప్రక్రియపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ డ్రైవ్ కోసం దేశవ్యాప్తంగా క్యాంప్‌లను త్వరలో నిర్వహించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్, వ్యవసాయ భూసంరక్షణ ఏడీఏ మురళీ, వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు ఆందోళన


నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెహ్రూచౌక్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ఆందోళన చేపట్టారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులకు అందాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ. 1480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్‌లు తీసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. అలాగే, జీవో నంబరు 75ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేష్ జిల్లా నాయకులు లత, హేమంత్‌లతో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

పరవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు వ్యాపార ప్రకటనలు, ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ సూచించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం వాడ చీపురుపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో మాట్లాడారు. వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు షైలపల్లి అప్పన్న, సొసైటీ ప్రతినిధులు చుక్క సోమేశ్వరరావు, సూరాడ రాజేంద్ర, వాసుపల్లి పుష్పమిత్ర, కన్నూరు సన్యాసిరావు, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం విక్టోరియా ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో వసంతోత్సవం


స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కశింకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోటలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మొదటి శనివారం వేంకటేశ్వరస్వామికి వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవ విగ్రహాలకు పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, చెరకురసం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. రేజేటి శ్రీరామా చరణాచార్యులు, రేజేటి మారుతి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు.

ఆంధ్రా బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కనకరాజు


ఉరుకూటి కనకరాజు

అగనంపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా గాజువాకకు చెందిన ఉరుకూటి కనకరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఆదివారం నుంచి ఈ నెల 25 వరకు జరగనున్న 50వ ఏపీ రాష్ట్ర బాలుర అంతర్ రాష్ట్ర కబడ్డీ చాంపియన్ పోటీలకు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కనకరాజు వ్యవహరించనున్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్రా జట్టుకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించడం పట్ల కనకరాజు ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి


ఎంఈవోను కలిసిన యూటీఎఫ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు శనివారం ఇక్కడ ఎంఈవో ఎం.దివాకర్‌ను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను కలిసిన అనంతరం మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, మండల శాఖ అధ్యక్షుడు మామిడి బాబూరావు, ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్, బండారు రవీంద్రపాత్రుడు, రెడ్డి అర్జున్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన రత్నాకర్



అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

గవర సంక్షేమ సంఘం వన సమారాధన వాయిదా

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఆదివారం జరగాల్సిన గవర సంక్షేమ సంఘం వన సమారాధన వాయిదా పడింది. అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా ఎడ తెరిపి లేకుండా చిరుజల్లులు పడుతుండడంతో 29వ తేదీకి వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి

కశింకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లి గ్రామ శివారున ఉన్న చేనుల్లో కోడిపందాలు ఆడుతున్న స్థావరంపై దాడి చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి రెండు కోడి పుంజులు, రూ.5,650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందాలాడుతున్న చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఐదుగురిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

కిశోర బాలికల వికాసంపై శిక్షణ రేపు

కశింకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న కిశోర బాలికల వికాసంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ప్రభావతి తెలిపారు. శనివారం ఆమె విలేకలతో మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికలకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో కమిటీలుగా ఏర్పాటు చేసి వారి ద్వారా గ్రామస్థులందరికీ అవగాహన కల్పిస్తామని చెప్పారు. బాలికల్లో ఆత్మధైర్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పీడీ అనంతలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వివరించారు.

నాటక రంగానికి పూర్వ వైభవం రావాలి

▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


ఉక్కు సంకెళ్లు నాటికలోని ఓ సన్నివేశం


రామలింగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాటక రంగానికి పూర్వ వైభవం రావాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో హైదరాబాద్ కళా విపంచి, తెలుగు డ్రామా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలను ఎమ్మెల్యే కొణతాల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకరంగానికి అనకాపల్లిలో మంచి గుర్తింపు ఉందన్నారు. సినీ నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ మరో రెండేళ్లల్లో ఆంధ్రా నాటక కళాపరిషత్ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని, ఆ కార్యక్రమాన్ని ప్రభుత్వమే నిర్వహిస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాటకరంగానికి ఎనలేని సేవలందించిన కొల్లి మోహనరావు, ఎల్.రామలింగేశ్వరరావులకు బొప్పన ఆత్మీయ పురస్కారాల్లో భాగంగా ఎమ్మెల్యే కొణతాల వారిద్దర్నీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మహతి క్రియేషన్స్ వారి ఉక్కు సంకెళ్లు, విశాఖ ఉక్కునగరం చైతన్య కళా స్రవంతి వారి (అ)సత్యం నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డి.రామకోటేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్, కాండ్రేగుల రామఅప్పారావు, కొణతాల నరసింహరావు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, కేఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలకు సత్వర పరిష్కారం


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేద్కర్

పరవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో అందించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.వి.అంబేద్కర్ తెలిపారు. మండలంలోని తాడి గ్రామంలో శనివారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి ఇటువంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, స్థానిక నాయకులు సాలాపు మోహన్, కె.రాజు, ఎస్.రమణ, డి.నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని నల్లరేగులపాలెం, నారపాడు గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు రైతులు వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి సమస్యకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సరంచ్ మామిడి శంకరరావు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, లోకేశ్, రాంబాబు, వీఆర్వో అనంత్, గ్రామ పెద్దలు రాపేటి రాము, రామకోటి, రామకృష్ణరాజు, గొర్లి నూకరాజు, రైతులు పాల్గొన్నారు.


సబ్బవరం మండలం నల్లరేగులపాలెంలో...

వివాదాల పరిష్కారానికి సమన్వయ కమిటీ

▸ సభ్యులుగా తహసీల్దార్, సీఐ, ఎంపీడీవో

▸ మండల స్థాయిలో సాధ్యం కానివి జిల్లా కమిటీకి నివేదన


సమసన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

సబ్బవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తలెత్తిన వివాదాలు, ముఖ్యంగా భూ వివాదాలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. శనివారం ఇక్కడ ఏర్పాటైన కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ కమిటీలో తాను, సీఐ, ఎంపీడీవో ఉంటారన్నారు. మండల ప్రత్యేకాధికారి పర్యవేక్షిస్తారని వివరించారు. ప్రతి శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇరువర్గాల వాదనలు విని రికార్డు చేసుకుని, వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు పరిశీలనకు జెరాక్స్ కాపీలు తీసుకుంటామన్నారు. వాటిని తమ వద్ద ఉన్న రికార్డులతో సరిపోల్చి మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వివరించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కమిటీకి నివేదించనున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే, భూ సమస్యలపై ఐదు దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ పిన్నింటి రమణ, ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డి బి.చైతన్య, ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు


అనకాపల్లిలో సర్పంచ్ అప్పారావును సత్కరించిన వైసీపీ నాయకులు


పరవాడలో జగన్ బర్త్ డే కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు తదితరులు ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావును సత్కరించారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం, ప్రసూతి ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పరవాడ : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కేక్‌కట్ చేశారు. వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, పార్టీ నాయకులు కోన రామారావు, బంధం నాగేశ్వరరావు, చుక్క రామునాయుడు, వెన్నెల సన్యాసిరావు, పైలా అప్పలనాయుడు, గొల్లవిల్లి శ్రీను, అశోక్, సూరిబాబు, చిన్నారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను సబ్బవరంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కేక్‌కట్ చేశారు. మొగలిపురంలో ఆ పార్టీ నేత గండి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపి పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు అందజేశారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకు గోవింద, నాయకులు బోకం రామునాయుడు, కర్రి బాబు, కొటాన రాము, నారాయణమూర్తి, సురేశ్ రాజ్, యడ్లనాయుడు, వడ్డాది అప్పలరాజు, శేషుబాబు, రమేష్‌నాయుడు, కోన సంజీవరావు, ధనిమిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ మేధో సంపత్తి గొప్పది

▸ గణిత దినోత్సవంలో వక్తలు ప్రశంస



సబ్బవరం కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామానుజన్ మేధో సంపత్తి గొప్పదన్నారు. ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆధునిక యుగంలో గణితానికి ఉన్న ప్రాధాన్యత ఎక్కువన్నారు. మ్యాథ్స్ విభాగాధిపతి ఎంవీ రామకృష్ణ మాట్లాడుతూ గణితం ప్రాధాన్యతను సోదాహరణగా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎం.గోవిందరావు, బి.లక్ష్మి, అశోక్, వై.రాజేశ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గణేశ్ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి డీఏవీ స్కూల్‌లో శనివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రముఖ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహాదేవశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై ప్రత్యేక దృష్టిసారిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


డీఏవీ స్కూల్‌లో రామాజన్‌కు నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఉల్లాసంగా... ఉత్సాహంగా

» డిప్యూటీ సీఎం పవన్ పర్యటన విజయవంతం » ఘన స్వాగతం

» థింసా నృత్యం.. సంప్రదాయ డప్పు వాయిద్యం

అనంతగిరి మండలం పినకోట పంచాయతీ బల్లగరువు గ్రామంలో శనివారం ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతమైంది. పవన్ గిరిజనులతో మమేక మయ్యారు. డోలీమోత కష్టాలు తెలుసున్నారు. కళాకారులతో కలిసి థింసా నృత్యం చేస్తూ.. గిరిజన సంప్రదాయ వాయిద్యాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ పోషకాహారం, జీసీసీ, వన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అక్కడి వేదికనుంచి మన్యంలో రూ.105 కోట్లతో నిర్మించనున్న 19 రోడ్లకు శంకుస్థాపన చేశారు. - అనంతగిరి, ఆంధ్రజ్యోతి


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న యువతులు


వన్‌వికాస్ కేంద్రం స్టాల్ బోర్డు పరిశీలిస్తున్న పవన్


పవన్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న దొన్నుదొర, పక్కన ఎమ్మెల్యే బండారు, పంచకర్ల, కలెక్టర్ దినేశ్‌కుమార్

సుర్తిపల్లి గ్రామానికి రహదారి సౌకర్యం


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

జి.మాడుగుల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరాపల్లి పంచాయతీ మారుమూల సుర్తిపల్లి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్టు సర్పంచ్ మసాడ రాజులమ్మ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోఈ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. దశల వారీగా అన్ని మారుమూల గ్రామాలకు రోడ్డు, తాగు, సాగు నీటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. పెదబాలన్న, ఎ. వెంకటరమణ, వరహాలనాయుడు, కొండబాబు బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లు ఆత్మ పరిశీలన చేసుకోవాలి'

చింతపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో వైసీపీ కార్యకర్తల్లా పనిచేసిన సమయంలో గ్రామ వలంటీర్లకు ఉద్యోగ భద్రత గుర్తుకురాలేదా...? అని టీడీపీ సీనియర్ నాయకుడు పాంగి రాము ప్రశ్నించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడేరు నియోజక వర్గంలో కొంత మంది గ్రామ వలంటీర్లు వైసీపీ నాయకులతో కలిసి ప్రచారం చేశారన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సైతం తమ వద్ద ఉన్నాయన్నారు. పలువురు వైసీపీపై విధేయత చూపుతూ వలంటీర్ల విధులకు రాజీనామా చేసి పార్టీ కార్యకర్తల్లా పనిచేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఉద్యోగాలు కావాలంటూ మొసలి కన్నీరు కార్చుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ముందు గ్రామ వలంటీర్లు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఇప్పటికైనాప్రభుత్వంపై అసత్య ప్రచారాన్ని మానుకోవాలని హితవుపలికారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు

గిరిజన గ్రామాల్లో పొంచి ఉన్న ప్రమాదం


కరుగొండలో ప్రమాదభరితంగా ఉన్న స్తంభం

పెదబయలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల మారుమూల గ్రామాలలో గిరిజనులు భయాందోళన మధ్య జీవనం సాగిస్తున్నారు. గోమంగి పంచాయతీ పరిధిలోని కరుగొండా, బొడ్డపుట్, కుంతూరుపుట్టు, సంపంగిపుట్టు,లగిసపల్లి గ్రామాల పరిధిలో దశాబ్దాల కిందటి సుమారు 50వరకు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు అవి కూలిపోతాయో తెలియస్థితిలో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్తంభాల కింద భాగంలో తుప్పుపట్టి రంధ్రాలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈదురు గాలుల ప్రభావానికి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ స్తంభాలన్నీ జనావాసాల మధ్య ఉండడంతో పెను ప్రమాదం జరిగే వీలుందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే భారీ స్థాయిలో ప్రమాదం ఏర్పడుతుందని వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలు మార్చాలని అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని వార్డు సభ్యురాలు కరుగొండా రాజులమ్మ, గ్రామస్తులు కోటిబాబు, సోకేలి లక్ష్మణరావు, మన్నధరావు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

సీలేరు పంప్డ్ స్టోరేజీ పనుల్లో కదలిక

» కార్యాలయాలు, సిబ్బంది నివాసాలకు టీఆర్‌సీ క్యాంప్‌లో చురుగ్గా చదును పనులు

» మెగా కంపెనీకి చెందిన పలువురు సిబ్బంది రాక

సీలేరు, డిసెంబరు 21 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరుకు మంజూరైన 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ పనుల్లో కదలిక కనిపిస్తోంది. దీని నిర్మాణం కోసం వచ్చే సంబంధిత కంపెనీ ఇంజనీర్లు, సిబ్బంది కార్యాలయాల నిర్మాణ పనులను స్థానిక టీఆర్‌సీ క్యాంప్‌లో శనివారంప్రారంభించారు. దీంతో సీలేరులో పంప్డ్ స్టోరేజీకి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లేనని ఈ ప్రాంతీయులు భావిస్తున్నారు. సీలేరు పంప్డ్ స్టోరేజీ పనులను రూ. 12, 500 కోట్లకు గత వైసీపీ ప్రభుత్వం హయాంలోని మెగా కంపెనీ టెండర్ ద్వారా పనులను దక్కించుకుంది. అయితే, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరు జాప్యం కావడంతో పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అనుమతులపై దృష్టి సారించింది. గత నెలలో అడిషనల్ ప్రిన్స్‌పల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు రాహుల్ పాండే, కేంద్ర పర్యావరణ కమిటీ సభ్యుడు బాలాజీ ఇక్కడ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్టుకు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ పడటంతో పనులను దక్కించుకున్న


భూమిని చదును చేయిస్తున్న మెగా కంపెనీ సిబ్బంది

మెగా కంపెనీ యాజమాన్యం ముందుగా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన యంత్ర సామగ్రిని భద్రపరిచేందుకు అవసరమైన ప్రదేశం, కార్యాలయాల సిబ్బందికి అవసనమైన రూమ్‌ల నిర్మాణం కోసం టీ ఆర్‌సీ క్యాంప్‌లో (గురుకుల పాఠశాలలో) ఖాళీగా ఉన్న జెన్‌కో ఆధీ నంలోని స్థలాన్ని జేసీబీలతో శరవేగంగా చదును చేయిస్తున్నారు. ఇప్పటికే మెగా కంపెనీకి చెందిన కొంత మంది సిబ్బంది, జేసీబీలు, క్రేన్ వంటి యంత్రాలు సీలేరుకు తరలించారు. దీంతో ఇక్కడ 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పనులకు కదలిక వచ్చినట్లేనని ఈ ప్రాంతీయులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

కాఫీకి ఆశాజనకమైన ధర

హుకుంపేట డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాఫీ పిక్కలకు ఎన్నడూలేని ధర రావడంతో రైతులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు గత ఏడాది కాఫీ నమ్ము కిలో రూ. 140 నుంచి రూ. 180, అరుదల రూ. 280 జీసీసీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది హుకుంపేట శనివారం వారపు సంతలో కాఫీ పాస్ మెంట్ ఆరుదల లేనిది రూ. 260 నుంచి రూ. 280 వరకు, పూర్తి ఆరుదల గింజలు రూ. 350 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అలాగే, మన్యందొర తదితర సంస్థలు కేవలం గ్రేడింగ్ కాఫీ పిక్కలు కిలో రూ. 60, ఇతర రకం పిక్కలు 40 చేసి కోనుగోలు చేస్తున్నాయి. ఈ పిక్కలు ధర రూ. 100కు కోనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వచ్చే వారం మరింత ధర ఉంటుందని వ్యాపారులు రైతులకు సూచించారు. అలాగే, మిరియాలకు కూడా ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


హుకుంపేట వారపు సంతలో విక్రయానికి తెచ్చిన కాఫీ గింజలు

సారాతో నలుగురి అరెస్టు

చింతపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు, చింతపల్లి సరిహద్దు గ్రామాల్లో సారాతో నలుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.కూర్మారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ రాష్ట్ర టాస్క్‌ఫోర్సు, అనకాపల్లి ఏసీ ఎన్‌ఫోర్సుమెంట్‌తో కలిసి కొయ్యూరు, చింతపల్లి సరిహద్దునున్న లంబసింగి, పరదేశిపాకలు, కొత్తబంగారంపేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నలుగురినుంచి 114 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కి పంపించామన్నారు. గిరిజన గ్రామాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా తయారీపై సమాచారం ఇవ్వాలన్నారు.


సారాను స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది

పదవీ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

ముంచంగిపుట్టు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి బంగారుమెట్ట పంచాయతీ చీపురుగొంది గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడు బాలచంద్రుడు అందించిన సేవలు ఆదర్శనీయమని ఎంఈవో క్రిష్ణమూర్తి అన్నారు. బాలచంద్రుడు పదవీ విరమణ అయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవోతో పాటు ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు గోవిందరావు, ఏపీ రాష్ట్ర ఫెడరేషన్ ఉపాధ్యాయ ప్రతినిధి కామేశ్వరరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు గడువు 10

పాడేరురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీవోఎస్ఎస్) ఆధ్వర్యంలో మార్చి 2025లో నిర్వహించే పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫీజులను ఈ నెల 23వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ లోగా ఏపీ ఆన్‌లైన్ సేవా కేంద్రం లేదా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 23వ తేదీ నుంచి 31వ తేదీలోగా ఫీజులు చెల్లించవచ్చునన్నారు. రూ. 25 అపరాధ రుసుంతో జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు, రూ. 50 అపరాధ రుసుంతో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు, జనవరి 9, 10వ తేదీలలో పదో తరగతి అభ్యాసకులు తత్కాల్ రుసుం రూ. 500, ఇంటర్మీడియేట్ అభ్యాసకులు రూ. 1,000తో పరీక్ష ఫీజు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు.



జి.ముంచంగిపుట్టులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ త్రినాధరావు


గుంటసీమ రెవెన్యూ సదస్సులో అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం

వంజంగి, జి.ముంచంగిపుట్టులో 322 అర్జీల స్వీకరణ

పాడేరురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సు లు గిరిజన ప్రాంత ప్రజల భూ సమస్యలు పరిష్కారానికి దోహదపడుతున్నాయని తహసీల్దార్ వంజంగి త్రినాదరావు నాయుడు అన్నారు. మండలంలో వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెవెన్యూ సదస్సులలో అందే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చ ర్యలు చేపడుతున్నామన్నారు. వంజంగి, జి.ముంచంగిపుట్టు గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన సదస్సుల్లో 322 ప్రజల నుంచి భూ సమస్యలు, భూ సరిహద్దులు, మ్యుటేషన్‌ల సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. వంజంగి సదస్సులో 139, జి.ముంచంగిపుట్టు సదస్సులో 183 వినతులు అందాయన్నారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, సర్పంచ్ కిల్లో ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు డి.సన్యాసిరావు, ఉపసర్పంచ్ జె.సరోజ, డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు, ఎ లక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వోలు కె.గణపతమ్మ, కె.నర్సింహం, గ్రామ పెద్దలు పాల్గొనారు.

గుండసీమలో..

డుంబ్రిగుడ: భూ సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు వేదికగా నిలుస్తాయని ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ అన్నారు. మండలంలోని గుంటసీమలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గిరిజన రైతులనుంచి భూ సమస్యలు, సరిహద్దులు, మ్యూటేషన్ తదితర సమస్యలపై అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకుడు జక్కయ్య, రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మాజీ వైస్ ఎంపీపీ కుటుంబాన్ని ఆదుకోవాలి'

జి.మాడుగుల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మండల వైస్ ఎంపీపీ తబర్నా బొంజునాయుడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. బొంజునాయుడు మంగళవారం కల్లు చెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేసి భీరం పంచాయతీలో ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీగా మండల ప్రజలకు అనేక సేవలు అందించారని చిట్టిబాబు కొనియాడారు. టీడీపీకి అయన సేవలు మరవలేనిదని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు.

సౌర విద్యుత్ సద్వినియోగం చేసుకోవాలి: డీఈఈ


మాట్లాడుతున్న డీఈఈ సన్ని రాంబాబు

చింతపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు సౌర విద్యుత్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కోట్ల సన్ని రాంబాబు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో భాగం గా సౌర విద్యుత్ సదుపాయంతో కలుష్య రహిత భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. గృహాలపై సౌర విద్యుత్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఎస్సీఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుతో విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. ఈ విద్యుత్ కనెక్షన్లకు ఈపీడీసీఎల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. సౌర విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ పద్ధతిలో చెల్లింపునకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈస్టెర్న్ పవర్ యాప్ ద్వారా సులభంగా సెల్ ఫోన్ నుంచి బిల్లు చెల్లించవచ్చునని తెలిపారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ప్రతి కుటుంబానికి విద్యుత్ సదుపాయం కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తా జాగా రెండు మండలాల్లో పీవీటీజీలకు 3,649 కనెక్షన్లు, నాన్ పీవీటీజీలకు 2,457 కనెక్షన్లు ఇచ్చామన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఈ గ్రామాల్లో 126 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ వనుము ప్రభాకరరావు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ : కలెక్టర్

పాడేరురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకు ఏక సభ్య కమిషన్ నియాకమైనట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యులుగా విశ్రాంతి ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాను జీవో 86 సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం నియమించిందన్నారు. ఏక సభ్య కమిషన్ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిశీలన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో, విద్యా సంస్థల్లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గాల ప్రాతినిధ్యం, ప్రావీణ్యంపై వివిధ ఉప వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరంగా ఉన్న వెనుకబాటును పరిశీలిస్తారన్నారు. ఈ రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలకు తగు ధ్రువ పత్రాలతో వ్యక్తులు, సంస్థలు వినతులను కమిషన్ కార్యాలయంలో పని దినాల్లో జనవరి 9వ తేదీ లోగా స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్, ఫస్ట్ ఫ్లోర్, కోనేరు లక్ష్మయ్య స్ట్రీట్, మొగల్‌రాజుపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ 520010 సమర్పించాలని సూచించారు.

ఘనంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం



మాట్లాడుతున్న డీఈఈ సన్ని రాంబాబు

సీలేరు, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు డీఏవీ పాఠశాలలో శనివారం ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్. కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికిఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి , ఈఈ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ఇంటిగ్రేటెడ్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. వివిధ నమూనాలు రూపకల్పనపై అభినందించారు. ఇతర పాఠశాలల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు.

78 మందికి కు.ని. ఆపరేషన్లు


మాట్లాడుతున్న డీఈఈ సన్ని రాంబాబు

ముంచంగిపుట్టు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిలగాడ పీహెచ్‌సీలో 78 మందికి కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. శుక్ర, శనివారం మొత్తం రెండు రోజులపాటు ఈ శస్త్ర చికిత్సలు చేపట్టామన్నారు. శస్త్ర చికిత్సలు అనంతరం వారిని అంబులెన్స్‌లో స్వగ్రామాలకు తరలించినట్టు తెలిపారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి రూ.1100 చొప్పున వారి వ్యక్తిగత ఖాతాలలో ప్రభుత్వ పరంగా నగదు జమ అవుతుంద తెలిపారు. ఈ కార్యక్రమంలో కిలగాడతోపాటు వివిధ పీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారులు లక్ష్మీకాంత్, బాజ్జి, శివప్రసాదు, ఈశ్వర్‌సందీప్, నిఖిల్, శిరీష, ప్రతాప్, శేఖర్, చైతన్య, బాబ్జీ, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, హెల్త్ సూపర్‌వైజర్లు వైదవతి, క్రిష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌పై అవగాహన అవసరం


వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినులు

జి.మాడుగుల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీపై అవగాహన కలిగి ఉండాలని ఆ సంస్థ ప్రతినిధులు గంగరాజు, సూర్యారావు సూచించారు. మండలంలోని శనివారం పలు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ. రెడ్ క్రాస్‌పై అవగాహన పెంచుకుని ప్రజలకు సేవలు అందించాలన్నారు. విరాళాల సేకరణ, సభ్యత్వాల నమోదు చేయాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశు భ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దీని వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో ఇక్కట్లు


డుంబ్రిగుడ సమీపాన ఆరుబయట వర్షంలో వరి కుప్పలు

డుంబ్రిగుడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా ముసురు అలుముకుంది. మూడు రోజులుగా తెరిపివ్వని వర్షం కురుస్తుండంతో గిరిజనులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. కోతకువచ్చిన వరి పనలను కళ్లాలకు తరలించి టార్పాలిన్లు కప్పి సంరక్షిస్తున్నారు. మండంలోని రహదారులు చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇక్కట్లకు లోనవుతున్నారు.

రహదారుణం.. రాకపోకలకు నరకం!

భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రహదారి భయంకరంగా తయారైంది. ఎక్కడికక్కడ రాళ్లు తేలిపోయి రూపుమారిపోయింది. ఆద్యంతం భారీ గతుకులతో దారుణ స్థితికి చేరింది. వర్షాలకు నీరు చేరిపోయి చెరువులను తలపిస్తోంది. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు ప్రత్యక్ష నరకం చవిచూడాల్సి వస్తోంది.

అస్తవ్యస్తంగా భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు

- ఆద్యంతం తేలిపోయిన రాళ్లు.. ఎక్కడికక్కడే భారీ గతుకులు
- వర్షాలకు నీరు చేరి చెరువులను తలపిస్తున్న రహదారి
- వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారుల అగచాట్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



బీఎన్ రోడ్డులో మేడివాడ సమీపంలో చెరువును తలపిస్తున్న గతుకులు

రావికమతం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు అధ్వానంగా మారింది. రావిమతం నుంచి మేడివాడ పెద్ద చెరువు వరకూ అడుగడుగునా రోడ్డు పోలిక లేకుండా బురదమయమైంది. కొన్ని చోట్ల రోడ్డులోని భారీ గతుకుల్లో వర్షం నీరు నిండిపోయి చెరువుల్లా తయారైంది. దీంతో గోతుల లోతు అంచనా వేయలేక వాహనదారులు పల్టీలు కొడుతున్నారు. కొన్ని చోట్ల ఇటీవల గ్రామస్థులు మట్టితో పూడ్చిన గోతులు, ఈ వర్షాలకు అడుగు తీసి అడుగు వేయలేని విధంగా బురదబురదగా మారింది. మత్స్యవానిపాలెం నుంచి కొత్తకోట వరకు రోడ్డు ఇదే పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల గతుకుల్లో



అరిశంకల వారి ఇళ్లు వద్ద భారీ గతుకులతో ఉన్న బీఎన్ రోడ్డు

బరువుతో వెళ్లే లారీలు, వ్యాన్లు కూరుకుపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

వర్షాలకు ఈ రోడ్డు మరింత దారుణంగా మారి వాహనాలకు, ప్రయాణికులు, పాదచారులకు చుక్కలు చూపెడుతోంది. ప్రధానంగా రావికమతం మేడివాడ పెద్ద చెరువు వరకూ నాలుగు కిలోమీటర్లు, కొత్తకోట నుంచి బంకు వరకు దాటాలంటే గంటల సమయం పడుతోందని వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాస్త దూరం రోడ్డు గోతులు దాటితే ఓ గండం గట్టెక్కినట్టేనని వారు వాపోతున్నారు. ఇటీవల మేడివాడ వద్ద రోడ్డు మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ నామమాత్రంగా గొయ్యిలను కప్పివేసి చదును చేసినప్పటికీ, ఈ వర్షాలకు గోతులు యథాతథంగా తయారయ్యాయి. ప్రస్తుతం ఈ రహదారిలో ప్రయాణం చేయడానికి ప్రత్యక్ష నరకం చవిచూడాల్సి వస్తున్నదని వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రహదారిని ప్రయాణానికి అనువుగా అభివృద్ధి చేయాలని వారు వేడుకుంటున్నారు.



గర్నికం బాల చెంచుమ్మ ఆర్చ్ సమీపంలో బురదమయమైన బీఎన్ రోడ్డు



రావికమతం హీరోహోండా షోరూమ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న భారీ గొయ్యి

బీఎన్ రోడ్డు మరమ్మతు చేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడండి



బీఎన్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

రోలుగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా తయారైన రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని సీపీఎం నాయకులు వేడుకున్నారు. ఈ మేరకు శనివారం రోలుగుంటలో బీఎన్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం నేత కె.గోవిందరావు మాట్లాడుతూ మండలంలోని వెలంకాయలపాలెం నుంచి రోలుగుంట పోలీసు స్టేషన్ వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఈ నెల రోజుల్లోనే తొమ్మిది మంది ప్రమాదాలకు గురై గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తరచూ వాహనాలు మరమ్మతులకు గురై బోల్తా పడుతున్నాయని, పలువురు మృత్యువాత పడ్డారని వాపోయారు. అయినప్పటికీ ఆర్అండ్‌బీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.దేవునినాయుడు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గెమ్మిలి వాసు తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంగయ్య

మాకవరపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అవంతి కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్‌మెడిటేషనర్ ట్రైనర్ మంగయ్య మాట్లాడుతూ దైనందిన జీవితంలో వివిధ కారణాలతో ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారని, దాన్ని జయించడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ యోగాసనాలపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం: పట్టణంలోని వికాస యోగా కేంద్రంలో యోగా గురువు అల్లెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు భూలక్ష్మి, నాగేశ్వరి, శ్రీనివాస్, రాజు, రాధా, మాతాజీ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



భూ తగాదాపై ఇరు వర్గాలతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్యామ్యూల్

గొలుగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా ప్రతీ శనివారం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నామని మండల ప్రత్యేకాధికారి శ్యామ్యూల్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వేదికలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భూ తగాదాలతో పాటు ఇతర దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం కమిటీని నియమించిందన్నారు. ఈ కమిటీకి ఇరు వర్గాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో భూ సమస్యల పరిష్కార వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు

మాకవరపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం భూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఇకపై గ్రామాల్లో భూ తగాదాలను మండల కమిటీ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామన్నారు. ఇక్కడ కూడా పరిష్కారం కాకపోతే జిల్లా కమిటీ సభ్యులు పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో జాన్ ప్రసాద్, ఎస్ఐ దామోదరనాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

నర్సీపట్నం, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మిలిపోయిన సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కువ స్థానాల్లో కూటమి పార్టీల మద్దతుదారులు హవా సాగించారు.

మెజారిటీ స్థానాల్లో కూటమి మద్దతుదారుల హవా

పెద్దేరు సంఘం వైస్ చైర్మన్‌గా గోవిందరాజు

రావికమతం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో అయీషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పెద్దేరు రిజర్వాయర్ సంఘం ఎన్నికలో వైస్ చైర్మన్‌గా గర్నికం గ్రామానికి చెందిన ఆర్లె గోవిందరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ సీనియర్ నేత ఆర్లె నూకరాజు కుమారుడు గోవిందరాజుకు ఈ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే రాజు సూచించగా, టీడీపీ శ్రేణులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, క్రియాశీలక నేత బంటు శ్రీను తదితరులు గోవింద్‌ను అభినందించారు.



పెద్దేరు వైస్ చైర్మన్ గోవిందరాజును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

తాండవ చైర్మన్‌గా సత్యనారాయణ

నాతవరం: తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా నాతవరానికి చెందిన కరక సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా కాకినాడ జిల్లా కోటనందూరు మండలానికి చెందిన ఎం.జోగిబాబు ఎన్నికయ్యారు. నర్సీపట్నం జలవనరుల శాఖ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. వారికి ఎన్నికల అధికారి స్వరూపరాణి ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనయుడు రాజేశ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, నాయకులు వారిని సత్కరించారు.

పాలవెల్లి చైర్మన్‌గా చిన్నంనాయుడు

చీడికాడ: కోనాం జలాశయం కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారి వీవీ రమణ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి వేణుగోపాలనాయుడు కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన పోతల చిన్నంనాయుడు, ఉపాధ్యక్షుడు కె.చిన్నంనాయుడులకు ధ్రువపత్రాలు అందజేశారు. కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను టీడీపీ నాయకులు అభినందించారు.

రైవాడ చైర్మన్‌గా పాత్రునాయుడు

దేవరాపల్లి: రైవాడ జలాశయ చైర్మన్‌గా పోతల పాత్రునాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి వై.శ్రీనివాసరావు అతనికి ధ్రువపత్రాన్ని అందజేశారు. వైస్ చైర్మన్‌గా బొడ్డు ఉమాదేవీ ఎన్నికయ్యారు. జలాశయ డీఈఈ ఆర్.సత్యంనాయుడు, ఏఈఈ నందకిశోర్, నాగేంద్ర ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి అభినందించారు.

తెన్నేటి జలాశయం చైర్మన్‌గా జగ్గారావు

మాడుగుల: మండలంలో తెన్నేటి విశ్వనాథం జలాశయం (పెద్దేరు) ప్రాజెక్టు చైర్మన్‌గా గాదిరాయి గ్రామానికి చెందిన అద్దెపల్లి జగ్గారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కేబీబీ అగ్రహారం చానల్ రెండో కాలువ చైర్మన్‌గా రావికమతం మండలం గర్నికం గ్రామానికి చెందిన ఆర్లి గోవిందరాజుని, కింతలి కెనాల్ చైర్మన్‌గా కోట్ని వెంకటరాజును ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీరి ప్రమాణా స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాణ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లను నాయకులు సన్మానించారు.

అన్నదాతలకు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రవీంద్రనాథ్

చోడవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించడానికి వ్యవసాయానికి డిజిటల్ టెక్నాలజీ అనుసంధానం చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అగ్రిస్టాక్ కార్యక్రమంపై శనివారం వ్యవసాయాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన సమస్త సమాచారం అగ్రిస్టాక్‌లో నిక్షిప్తమై ఉంటుందన్నారు. దీని ఆధారంగానే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తారన్నారు. ఈ అగ్రిస్టాక్‌లో ప్రతీ రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయన్నారు. ఈ ప్రాజెక్టు గురించి రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను వ్యవసాయ శాఖ సిబ్బంది తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల వ్యవసాయాధికారులు పావని, భాస్కరరావు, సోమశేఖరరావు, కృష్ణవేణి, కాంతమ్మ, వ్యవసాయ విస్తరణాధికారులు, ఉద్యానవన శాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రవీంద్రనాథ్

బుచ్చెంపేట విశాఖ డెయిరీ కేంద్రం-2లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బుచ్చెంపేట విశాఖ డెయిరీ పాల కేంద్రం-2లో మూడేళ్లుగా నిధులు స్వాహా చేస్తున్నారని పాడి రైతులు శెట్టి గంగరాజు, వి.రమణ, ఎల్.సాయికుమార్, ఆర్.సన్యాసినాయుడు, ఈ.నూకరాజు, జి.చినబాబు, ఇ.సత్తిబాబు, జె.అర్జున, జి.సత్తిబాబు, ఉలబాల రమణ, ఎం.గంగరాజు శనివారం ఏరియా మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. వేతన కార్యదర్శి రమణకు పాడి పశువులు లేకపోయినా మూడేళ్లుగా ప్రతీ పేమెంట్‌కు రూ.17 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేయించి పాడిరైతుల సొమ్ము పక్కదారి పట్టిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్థానిక డెయిరీ సిబ్బంది సహకారం ఉందన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని వారు కోరారు.

వర్షాలతో నీట మునిగిన మినప మొక్కలు



చీడికాడలోని పొలాల్లో నానిపోతున్న మినప చేను

చీడికాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లోని మినప మొక్కలు నీటి మునిగాయి. 15 రోజులుగా వరి కోతలు కోస్తున్న దృష్ట్యా వెంటనే మినప విత్తనాలను జల్లుకున్నారు. మొక్క దశలోనే వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్, నాయకులు

నర్సీపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆధ్వర్యంలో శనివారం నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మాజీ ఎమ్మెల్యే గణేశ్‌తో సహా 110 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బి.సుబ్బలక్ష్మి, సీహెచ్.సన్యాసిపాత్రుడు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, పార్టీ నేత బి.విజయ్ పాల్గొన్నారు.

చోడవరం: పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్ జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపీపీ సభ్యుడు గాడి కాసు, నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, బి.సూర్యనారాయణ, సిమ్మునాయుడు, ఎం.శంకరరావు, గాడి అప్పారావు, చందు రాంబాబు, నెహ్రూ, సత్య, పుల్లేటి వెంకటేశ్ పాల్గొన్నారు.

మాడుగుల: మండల కేంద్రంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.రాజారాం, మాజీ ఎంపీపీ వి.రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, పార్టీ నేత ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, నాయకులు దాట్ల శివాజీ, బి.దేముళ్లు, బి.ముత్యాలనాయుడు, జి.వెంకట్రావు, వై.అప్పలరాజు, ఎల్.దేముడుబాబు, ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురంలో వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ జి.మణికుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ భాస్కరనాయుడు, ఎంపీటీసీలు బుల్లిప్రసాద్, ఎం.కృష్ణ, నాయకులు ప్రకాశ్, పి.శివ, కె.చినబాబు పాల్గొన్నారు.

చీడికాడ: వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంపీపీ కె.జయమ్మ, సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు పి.రామారావు, మహేశ్, సిహెచ్.అప్పలనాయుడు, జి.స్వామినాయుడు, ఎస్.రమణబాబు, నారాయణమూర్తి, పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక పీహెచ్‌సీలో మాజీ సీఎం జగన్ జన్మదినం సందర్భంగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ చింతల బుల్లి. లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ నేత బూరే బాబూరావు పాల్గొన్నారు.

23న ఐఐటీపై అవగాహన సదస్సులు

చోడవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు ఐఐటీపై అవగాహ కల్పించే లక్ష్యంతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈ నెల 23న పదో తరగతి విద్యార్థులకు సదస్సులు, టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు రమణాజీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు జెర్రిపోతుల రమణాజీ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టి, వారిని ఐఐటీ దిశగా ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రతీ హైస్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులు కూడా అందిస్తామన్నారు. అలాగే పట్టణంలోని ఉషోదయ కళాశాలలో ఈ నెల 30న ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్‌తో సెమినార్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రెండు నియోజకవర్గాల పరిధిలోని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం

కె.కోటపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు భూ సమస్యలపై ఆయా గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి.భాగ్యవతి సూచించారు. మండలంలోని మర్రివలస గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్వో బండారునాయుడు, సర్వేయర్ భూమిరెడ్డి కాసునాయుడు, మాజీ సర్పంచ్ కొటాన సూరిదేముడు, సర్పంచ్ అప్పలనరస పాల్గొన్నారు.

రామానుజన్ చరిత్ర తెలుసుకోండి

కె.కోటపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గణిత మేధావులలో ఒకరైన శ్రీనివాస రామానుజన్ గురించి ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలని అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం సూచించారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం అయ్యన్న విద్యాసంస్థలలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ విశ్వ విఖ్యాతిగాంచిన రామానుజన్ భారత దేశానికి చెందిన వారు కావడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి, అధ్యాపకులు కె.సూర్యనారాయణ, సీమునిరి రమణ, హైమావతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాల్లో గ్రామస్థులు భాగస్వాములు కావాలి



చీడికాడలో చెత్తను సేకరిస్తున్న అధికారులు

చీడికాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎస్.మూర్తి కోరారు. మండలంలోని చీడికాడ, జి.కొత్తపల్లి గ్రామాల్లో శనివారం స్వచ్ఛతా సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరమైన జీవనం సాగించగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందర్రావు, ఈవోపీఆర్డీ ఎం.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి ప్రత్యేకాధికారి మూర్తి సమీక్షా సమావేశం నిర్వహించారు.

భద్రతా వారోత్సవాలపై ర్యాలీ

గొలుగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం భద్రతా వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అలాగే కారు డ్రైవింగ్‌లో సీటు బెల్ట్ తప్పనిసరి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో-2 మూర్తి, వెలుగు ఏపీఎం కరుణానిధి, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మసీదు పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరుకు వినతి

మాడుగుల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాడుగుల కేంద్రంలో మసీదు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శాసన మండలి మాజీ చైర్మన్ మహ్మద్ షరీఫ్‌కు ముస్లిం నాయకుడు మస్తాన్ ఆధ్వర్యంలో మత పెద్దలు వినతిపత్రాన్ని అందించారు. పెందుర్తి గ్రామంలో శనివారం జరిగిన ముస్లింల బహిరంగ సమావేశంలో ఆయన్ను కలసి ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అలాగే 40 ఏళ్లకు పైబడిన మసీదు శిథిలావస్థకు చేరుకుందని, దీన్ని సరికొత్తగా నిర్మించడానికి నిధులు మంజూరు చేయించాలని వారు విన్నవించారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దేవరాపల్లి వాసుల ఘన స్వాగతం



పవన్‌కు స్వాగతం పలుకుతున్న కూటమి నేతలు, ప్రజలు

దేవరాపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనకు శనివారం వెళ్లిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు దేవరాపల్లిలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. విశాఖపట్నం నుంచి దేవరాపల్లి మీదుగా అల్లూరి జిల్లా గ్రామాలకు శనివారం పవన్ కల్యాణ్ వెళ్లారు. కూటమి నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ వారికి అభివాదం చేస్తూ అల్లూరి జిల్లా వెళ్లారు.



వాజంగి నుంచి బల్లగరువు గ్రామానికి బురదను దాటుకుంటూ వెళుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



వాజంగి వద్ద గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



బల్లగరువు గ్రామానికి పవన్‌కల్యాణ్‌తోపాటు నడుచుకుంటూ వెళుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పీవో అభిషేక్



రోడ్ల నిర్మాణానికి అనంతగిరి మండలం పినకోట పంచాయతీ బల్లగరువులో శనివారం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్. చిత్రంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఉన్నారు

ధ్యానం మీద అవగాహన కల్పించాలి

▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



స్పీకర్ అయ్యన్నపాత్రుడు ధ్యానం చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే పిల్లలకు ధ్యానం మీద అవగాహన కల్పించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం టీటీడీ కల్యాణ మండపంలో హార్ట్‌ఫుల్ నెస్ రామచంద్ర మిషన్, వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని అయ్యన్నపాత్రుడు తన భార్య పద్మావతితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం, యోగా గురించి పాఠ్యాంశాలుగా పెట్టి చిన్నతనం నుంచే బోధించాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కోసం ప్రతి రోజూ వాకింగ్, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది డిసెంబరు 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో భారీ ఎత్తున నిర్వహించడానికి తాను ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సీనియర్ సిటిజన్స్, లయన్స్ క్లబ్, నవ్య లయన్స్ క్లబ్, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్, వాసవీ క్లబ్ సంఘాల ప్రతినిధులు, మహిళలు, శ్రీ విద్య కళాశాల విద్యార్థులతో కలిసి 15 నిమిషాలు ధ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, హార్ట్‌ఫుల్ నెస్ రామచంద్రమిషన్ జెడ్‌సీ లక్ష్మయ్య, ఏఎంసీ మెంబర్ ఎం.సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ సారథులుగా అధ్యాపకులు

▸ మూడు జిల్లాల ఏపీసీలు నియామకం

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ పరిధిలోని సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లుగా డిగ్రీ, పాలిటెక్నిక్, డైట్ కళాశాలల అధ్యాపకులను నియమించారు. విశాఖ జిల్లా ఏపీసీగా రాజాం డిగ్రీ కళాశాల లెక్చరర్ జె.చంద్రశేఖర్‌రావు, అల్లూరి సీతారామరాజు ఏపీసీగా ఎస్.కోట డిగ్రీ కళాశాల లెక్చరర్ వీఏ స్వామినాయుడు, అనకాపల్లి ఏపీసీగా పార్వతీపురం డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.జయప్రకాష్ నియమితులయ్యారు.

ప్రస్తుతం విశాఖ ఏపీసీగా డీఈవోనే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో కూడా అక్కడ డీఈవోలే ఏపీసీలుగా ఏపీసీలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏపీసీలుగా కొన్ని జిల్లాలకు డిప్యూటీ కలెక్టర్లను నియమించిన ప్రభుత్వం, మరికొన్ని జిల్లాలకు డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులను నియమించింది. అయితే పాలనాపరమైన బాధ్యతలు అధ్యాపకులను నియమించరాదని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. గత ప్రభుత్వం అటువంటి నియామకాలు చేసినప్పుడు అభ్యంతరాలు వచ్చిన విషయం గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు అవే తప్పులు పునరావృతం అవుతున్నాయంటున్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం

▸ శాసనసభ స్పీకర్ అయ్యన్న



పెందుర్తిలో నూర్‌బాషా దూదేకుల సంఘ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న, మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పెందుర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం, అభివృద్ధి, విద్య, ఉపాధి నైపుణ్యం కల్పనకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నామినేటెడ్ పదవుల్లో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నూర్‌బాషా దూదేకుల జనగర్జన మహాసభ శనివారం పెందుర్తిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం దూదేకులకు అండగా ఉంటుందన్నారు. ముస్లిం యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి భవిష్యత్తులో ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ చేయూతతో యువత, మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, వారు తయారు చేసే వస్తువులకు బ్రాండింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సృజన, నైపుణ్యతకు బ్రాండింగ్ తోడ్పాటైతే సత్ఫలితాలు వస్తాయన్నారు. మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నూర్‌బాషాలు ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకుంటూనే హక్కులు సాధించుకుని సమష్టిగా కార్యసాధకులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయ, ఇతర రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు మంత్రిగా తన వంతు కృషి చేస్తానన్నారు.స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ సంఘ ఐక్యతను చాటి చెప్పే ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు ముస్లిం యువత భావితరాలకు స్ఫూర్తి అన్నారు.

పెందుర్తిలో భవనం ప్రారంభం

పెందుర్తిలోని ద్రోణంరాజునగర్‌లో నూతనంగా నిర్మించిన విశాఖ జిల్లా నూర్‌బాషా, దూదేకుల నూతన భవనాన్ని స్పీకర్ అయ్యన్న, మంత్రి ఫరూక్ సంయుక్తంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ప్రముఖులందరికీ ఘనసన్మానం చేశారు. ఇస్లాంలో తారతమ్యాలు లేవని, అందరూ సమానమని ఉద్ఘాటించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జీ, ఆహ్వాన కమిటీ చైర్మన్ షేక్ ఖాన్‌సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, యువజన ముస్లిం సంఘ ప్రతినిధి షేక్ షఫీ ఉల్లా పీర్ మహ్మద్, మస్తానమ్మ, ఎస్కే సుభాన్, షేక్ రెహమాన్, దావూద్ అలీ, సలీమ్ ఖాసీం పాల్గొన్నారు.

జిల్లాలో మిట్టల్ ఉక్కు పరిశ్రమ వద్దు

▸ దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

▸ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూడా..

▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

నర్సీపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అలాగే మిట్టల్ ఉక్కు పరిశ్రమ వద్దని అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం 24వ జిల్లా మహా సభలు నర్సీపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ బిల్డింగ్ నుంచి పార్టీ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. డప్పులు, థింసా నృత్య ప్రదర్శన నిర్వహించారు. తరువాత పాల్‌ఘాట్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడానికి నష్టాల్లో ఉందని తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ ప్రైవేటు ఉక్కు పరిశ్రమ తప్ప వేరే పరిశ్రమ ఏది ఏర్పాటు చేసినా స్వాగతిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు అప్రకటిత ఎమర్జెన్సీ విధానాలను అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం రూ.17 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగిస్తుంటే మౌనం వహిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రూ.99లకు నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పిన చంద్రబాబును నాణ్యమైన బియ్యం, పప్పులు ఇవ్వాలని మహిళలు కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, గిరిజన సంఘం నాయకులు గోవింద్, వెంకన్న, కోటేశ్వరరావు, త్రిమూర్తులురెడ్డి, కిల్లో సురేంద్ర, ఎం.అప్పలరాజు, ఐద్వా నాయకులు ప్రభావతి, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

సంతాన లేమితో సతమతం

... 5వ పేజీ తరువాయి

అనగానే మహిళలను చాలామంది బాధ్యులు చేస్తుంటారని, ఇది తప్పు అని కేజీహెచ్ గైనకాలజీ విభాగ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ సంధ్యాదేవి పేర్కొన్నారు.

మహిళల్లో సమస్యలు ఇవే

మహిళల్లో సంతానలేమి సమస్యకు కారణాలుగా వైద్యులు పలు అంశాలను పేర్కొంటున్నారు. ట్యూబల్ బ్లాకేజీ, ఫెలోపియన్ ట్యూబులు పూడుకుపోవడం, హార్మోన్ల అసమతుల్యత కారణంగా అండం విడుదల కాకపోవడం, పూర్తిస్థాయిలో ఎగ్ ఫార్మ్ కాకపోవడం, అండాశయంలో కొన్నిరకాల సమస్యలు వంటివి సంతానలేమి సమస్యకు కారణమవుతున్నాయి.

పురుషుల్లో ఇబ్బందులు..

స్పెర్మ్ కౌంట్ (వీర్య కణాల సంఖ్య) తగ్గడం, నాణ్యత లోపించడం, కణాల కదలిక క్షీణించడం (సాధారణంగా 100 ఎంఎల్ వీర్యంలో 15 మిలియన్ల కణాలు ఉండాలి) వంటి కారణాలుగా చెబుతున్నారు.

ఈ కారణాలతోనే సమస్య..

మహిళలు, పురుషుల్లో ఈ సమస్య రావడానికి జీవన విధానంలో వచ్చిన మార్పులు, అలవాట్లు కారణంగా వైద్యులు చెబుతున్నారు. మహిళల్లో థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యత, పీసీఓడీ, అధిక బరువు వంటి ఇబ్బందులు అధికం అవుతున్నాయి. ఇవి అండం విడుదల కాకపోవడానికి కారణమవుతున్నాయి. అందుకు శారీరక శ్రమ లేకపోవడం, పోషకాలు లేని ఆహారాన్ని తీసుకోవడం, జంక్ ఫుడ్ తీసుకోవడం, సరైన నిద్ర లేకపోవడం వంటి అంశాలు దోహదం చేస్తున్నాయి. పురుషుల్లో ధూమపానం, మద్యపానం, ఒబెసిటీ, ఆహారపు అలవాట్లు, ఇతర వ్యసనాలు కారణమవుతున్నాయి. ఇద్దరిలోనూ వృత్తిపరమైన టెన్షన్, ఒత్తిడి, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వంటి అంశాలు ఈ సమస్యను మరింత రెట్టింపు చేస్తున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

పరీక్షలో నిర్ధారణ

సంతానలేమి సమస్యకు అసలు కారణం ఏమిటో నిర్ధారించిన తరువాత వైద్యులు ఏం చేయాలో వివరిస్తారు. ఇందుకోసం పరీక్షలు చేయిస్తారు. దీన్నే ఇవాల్యూయేషన్ ప్రాసెస్‌గా చెబుతారు. పరీక్షల్లో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం వల్ల పిల్లలు పుట్టడం లేదా? లేక ఎగ్ రిలీజ్‌లో ఉన్న ఇబ్బందులు ఉన్నాయా?...అనేది నిర్ధారిస్తారు. మందుల వల్ల ప్రయోజనం లేనట్టయితే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్)కు రిఫర్ చేస్తారు. ఇందులో వివిధ రకాల పద్ధతులు ఉంటాయి. సాధారణంగా భార్య, భర్త కలిసినప్పుడు జరిగే ప్రక్రియను సాంకేతిక పద్ధతులను అనుసరించి పిండం ఏర్పడేలా చేసి పిల్లలు పుట్టేలా చేస్తారు.

తగిన జాగ్రత్తలతో చెక్..

కొన్నిరకాల జాగ్రత్తలను తీసుకోవడం వల్ల సంతానలేమి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒత్తిడి లేని జీవన విధానాన్ని కొనసాగించడం, శారీరక శ్రమ చేయడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం, స్మోకింగ్, ఆల్కహాల్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, 30 ఏళ్లలోపు వివాహాలు చేసుకోవడం, కెరియర్, ఇతర అవకాశాలు అంటూ పెళ్లైన తరువాత సంవత్సరాల తరబడి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం వంటి వాటికి దూరంగా ఉండడం ద్వారా సంతానాన్ని పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

సంతానలేమితో బాధపడే వారికి వైద్య సేవలు అందించేందుకు నగరంలో 30 వరకు ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఒక్కో ఆస్పత్రిలో నిత్యం కనీసం పది నుంచి 20 మంది సేవలను పొందుతున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. వైద్య రంగంలో ప్రస్తుతం ఇదే అతిపెద్ద వ్యాపారంగా కొనసాగుతోంది.

యువ జంటల్లో కూడా పెరుగుతున్న సమస్య

- డాక్టర్ ఐ.వాణి, గైనకాలజీ వైద్యులు, కేజీహెచ్

గతంతో పోలిస్తే సంతానలేమితో బాధపడుతున్న జంటల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేజీహెచ్‌కు దాదాపు 15 నుంచి 20 శాతం ఇటువంటి కేసులు వస్తున్నాయి. ఇరవై ఐదేళ్లలోపు వయసున్న అమ్మాయిల్లో కూడా ఎగ్ రిలీజ్ సమస్య, అబ్బాయిల్లో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం వంటివి చూస్తున్నాం. జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ తరహా సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఇబ్బందులు నుంచి బయటపడవచ్చు. కొందరు కావాలనే కొన్నాళ్లపాటు పిల్లలను వద్దనుకుంటారు. వృత్తిపరమైన ఒత్తిళ్లు, ఇతర ఇబ్బందులతో తరువాత కావాలనుకున్నా ఫలితం దక్కడం లేదు. కాబట్టి, 30 ఏళ్లలోపు పిల్లలు వద్దు అనుకునే ఆలోచన నుంచి యువ జంటలు రావాలి. పిల్లలు పుట్టిన తరువాత కూడా జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లినవారు ఎంతోమంది ఉన్నారు. పిల్లలు పుడితే జీవితాల్లో పైకి ఎదగలేమన్న ఆలోచన వద్దు. పిల్లలు పుట్టలేదని మానసిక వేదనకు గురికావాల్సిన అవసరం లేదు. అధునాతన వైద్య పద్ధతులను అనుసరించి పిల్లలను పొందేందుకు అనువైన మార్గాలు ఉన్నాయి.

క్రైం... crime news

మత్స్యగడ్డలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

పెదబయలు, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మత్స్యగెడ్డలో పడి మతిస్థిమితంలేని వ్యక్తి మృతి చెందారు. జీటీడబ్ల్యూ బాలికల పాఠశాల-1 సమీపాన స్థానిక యువత గెడ్డలో శనివారం తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులు, పంచాయతీ అధికారులకు సమాచారమిచ్చారు. స్థానిక ఎస్ఐ రమణ, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ముంచింగిపుట్టు మండలం కిలగడ పంచాయతీ మల్కారి పుట్టుకు చెందిన కుర్తాడి భానుచందర్ (28)గా గుర్తించారు. ఆయన కొన్నాళ్లుగా పెదబయలు పరిసర ప్రాంతంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్టు స్థానికులు తెలిపారు. సమాచారం మేరకు కుటుంబ సభ్యులు చేరుకుని మృతదేహాన్ని స్వ గ్రామం తరలించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బాలు, సుందర్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో యువకుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోరీ కేసులో ఓ యువకుడిని శనివారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక శారదాకాలనీకి చెందిన పలకా సంజయ్‌కు చెందిన ద్విచక్ర వాహనం ఇంటి వరండాలో పార్కింగ్ చేయగా, ఈ నెల 13వ తేదీన అపహరణకు గురైందన్నారు. శనివారం రోజు మాదిరిగా జాతీయ రహదారిలోని పూడిమడక రోడ్డు వంతెన వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చోరీకి గురైన వాహనంతో వస్తున్న నక్కపల్లికి చెందిన శీరం సాహిత్(19) ను అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాహనాన్ని చోరీ చేసి విశాఖ వెళ్లిపోయిన నిందితుడు సాహిత్ శనివారం స్వగ్రామం నక్కపల్లికి వెళుతుండగా వాహనాల తనిఖీలో పట్టుబడినట్టు ఎస్ఐ తెలిపారు.

ఒక ఉద్యోగం.. రెండు జీతాలపై నివేదిక ఇవ్వండి

▸ అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించిన జిల్లా సహకారి అధికారి

గొలుగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోద్యం పీఏసీఎస్‌లో ఒక ఉద్యోగం.. రెండు జీతాలపై తక్షణం నివేదిక అందజేయాలని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి స్వరూపారాణి అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్, చోద్యం సొసైటీ ఇన్‌చార్జి శ్రీనివాసరావును ఆదేశించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో చోద్యం సొసైటీలో ఒక ఉద్యోగం.. రెండు జీతాలపై వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. ఈ సందర్భంగా చోద్యం సొసైటీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. చోద్యం పీఏసీఎస్‌లో జీవో 151 ప్రకారం అమలు చేసిన వేతనం కంటే అధికంగా రూ.16 లక్షలు కార్యదర్శి దుర్వినియోగం చేశాడన్న అభియోగంపై తక్షణమే నివేదిక అందించాలని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి స్వరూపరాణి కోరారన్నారు. ఇక్కడ పని చేస్తున్న కార్యదర్శి ఆర్ఎస్ఎస్. రాజుకు షోకాజ్ నోటీసు ఎప్పుడు ఇస్తారని అడిగారన్నారు. సొసైటీలో కార్యదర్శిగా పనిచేస్తూ 15ఏళ్లుగా డ్రా చేసిన సొమ్ము నివేదికను జిల్లా కార్యాలయానికి అందించాలన్నారు. చీడిగుమ్మల, చోద్యంల్లో అదనంగా డ్రా చేసిన రికార్డులు అందించాలన్నారు. ఉన్నతాధికారులు అడిగిన సమాచారం సోమవారం అందించనున్నట్టు తెలిపారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ పదవీకాలం పొడిగింపు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించి జాయింట్ కలెక్టర్లకు ఆ బాధ్యతలను అప్పగించారు. జూన్‌లో ఇచ్చిన ఆదేశాలు ఈ నెల 26తో ముగియనున్నందున ఈ నెల 27వ తేదీ నుంచి ఆరు నెలలపాటు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వరి వర్షార్పణం

... 5వ పేజీ తరువాయి

కుళ్లిపోతేనే నష్టం జరిగినట్టు అంచనా వేస్తారు. పనల మీద, కుప్పలు వేసిన పంటకు నష్టం అంచనా వేయరు. దీంతో ఇప్పటికే కోసిన పంట నీళ్ల పాలవడంతో నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలమంచిలి, మునగపాక, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో వరి పంటకు ఎటువంటి నష్టం లేదని వ్యవసాయాధికారులు తేల్చారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మడుల్లో పెద్దగా నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదని, అక్కడక్కడా నీరు చేరినా నీరు బయటకు వదలడంతో రైతుకు నష్టం తప్పిందని చెబుతున్నారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి

ఇటీవల కురుస్తున్న వర్షాలతో పనల మీద ఉన్న వరి నష్టపోకుండా లీటరు నీటిలో 5 శాతం ఉప్పు కలిపిన ద్రావణంతో (50 గ్రాములు లీటరు నీటికి) కలిపి పనల మీద పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. దీని వల్ల గింజ మొలకెత్తకుండా ఉంటుందని, కోత దశకు వచ్చిన వరి పంటను వర్షాలు తగ్గేవరకు కోతల పనులు వాయిదా వేసుకోవడం మేలని సూచించారు. ఇప్పటికే కుప్పలు వేసిన వరి నష్టపోకుండా కుప్పలలో చేరిన వర్షపు నీరుతో గింజ మొలకెత్తకుండా, ధాన్యం రంగు మారకుండా 25 కిలోల గళ్లు ఉప్పు, 25 కిలోల ఊక కలిపి కుప్పలపై చల్లాలని తెలిపారు.

మట్టిలో మాణిక్యం మనీష్

... 5వ పేజీ తరువాయి

ఐఎస్ఆర్ఓ(ఇస్రో) ప్రాథమిక పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. అనంతరం ఆగస్టులో నిర్వహించిన మౌఖిక పరీక్షల్లో సత్తా చాటాడు. దీంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రోలో) సైంటిస్టుగా ఉద్యోగాన్ని సాధించాడు. ఉద్యోగంలో చేరాలని ఇస్రో నుంచి డిసెంబరు 17న ఉత్తర్వులు అందాయి. అలాగే ఈ ఏడాది జరిగిన గేటు పరీక్షల్లో మెరుగైన ర్యాంకును సాధించడంతో మరో మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్), ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాలో ఉద్యోగ అర్హత సాధించాడు. దీంతో మనీష్‌కు ఈ మూడు కంపెనీల నుంచి పిలుపు వచ్చింది. ఇస్రోలో సైంటిస్టు కావాలన్నదే తన ఆకాంక్ష అని మనీష్ తెలిపారు. ఇంతటి ప్రతిభ చూపిన మనీష్‌ను తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు అభినందించారు.

ఆ ఇంటిలోనే మరో తేజం

మోదయ్య, లక్ష్మి కుమార్తె సోనియా చదువుతోపాటు జాతీయ యోగాలో మెరిసింది. సోనియా ఆంధ్ర యూనివర్సిటీలో ఎంఏ యోగా పూర్తి చేసి,యోగా ఉపాధ్యాయినిగా స్థిర పడింది. ఆమె రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594